VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్లగడ్డ
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 09-05-2024 సంపుటి : 06 సంచిక : 236 పేజీలు : 8 వెల : రూ 3-00

## విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టును అనుమతి కోరిన ఏపీ సీఎం జగన్



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో ఈనెల 13న జరుగనున్న ఎన్నికల పోలింగ్ అనంతరం విదేశాలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి జూన్ 1వ తేదీ వరకు లండన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాలకు వెళ్లేందుకు అనుమతి కావాలంటూ బుధవారం సీబీఐ కోర్టులో అనుమతి కోరారు. దేశాలకు అనుమతి కోరుతూ బెయిల్ షరతు సడలించాలని కోర్టును కోరారు. పలు కేసుల్లో ఉన్న జగన్ దేశం విడిచి వెళ్ల వద్దని గతంలో కోర్టు ఆదేశాలు జారీ చేసింది . ఈ సందర్భంగా సీబీఐ కౌంటర్ వేయాలని కోర్టు ఆదేశిస్తూ విచారణ రేపటికి వాయిదా వేసింది.

## ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు బిగ్ రిలీఫ్..

ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు క్యాట్ ఊరటనిచ్చింది. ప్రభుత్వం ఆయనను రెండోసారి సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వేస్తూ.. సస్పెన్షన్‌ని ఎత్తివేయాలని ఆదేశించింది. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని.. సర్వీస్ పరంగా ఆయనకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని సూచించింది.సస్పెన్షన్ చట్ట విరుద్ధమని, ఈ విషయంలో సుప్రీంకోర్టు చెప్పినా మరోసారి సస్పెండ్ చేయడం ఉద్యోగిని వేధించడం కిందకే వస్తుందని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగం అధిపతిగా పని చేసిన కాలంలో ఆయన అవినీతికి పాల్పడినట్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోపించింది.

# వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలు




**మాఫియా వికాసమే లక్ష్యంగా ఐదేళ్ల వైకాపా పాలన**
**శాండ్ మాఫియాతో కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్**
**జల్‌జీవన్ మిషన్‌కు సహకరించని జగన్ సర్కార్**
**పులివెందులలో అరటి రైతుల కోసం క్లస్టర్స్ ఏర్పాటు**
**ఏపి అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఇప్పిస్తాం**
**కలికిరి ఎన్నికల ప్రచార సభలో మోదీ విమర్శలు**

అన్నమయ్య,మే8(: పేదల వికాసం కోసం కాదు.. మాఫియా వికాసం లక్ష్యంగా వైసీపీ సర్కార్ పనిచేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఐదేళ్లలో రైతులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని.. వైసీపీ మంత్రులు గుండాగిరి చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇక వారి ఆటలు సాగవని, వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలయ్యిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. జల్ జీవన్ మిషన్‌కు జగన్ సర్కార్ సహకరించలేదని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. శాండ్ మాఫియాతో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. రాయలసీమలో అపార ఖనిజ సంపద ఉందన్నారు. పర్యాటక రంగానికి అవకాశం ఉందని ప్రధాని మోదీ వివరించారు. పులివెందులలో అరటి రైతుల కోసం క్లస్టర్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏపీకి బుల్లెట్ ట్రైన్ ఇస్తామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో చేపట్టిన మంచి పనులను కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తానని చెబుతోందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. రామమందిర నిర్మాణంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వెనక్కి తీసుకుంటానని చెబుతోందని మండిపడ్డారు. రామ మందిరానికి తాళం వేస్తానని అంటుందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దేశాన్ని విభజిస్తూ మాట్లాడుతున్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన పనులతో భారతదేశానికి గల్ఫ్ దేశాల్లో గౌరవం పెరిగిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ వికాసమే తన లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటి ంచారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. అనేక ఖనిజాలు, దేవాలయాలు కలిగిన నేల రాయలసీమ.. ఈ ప్రాంతంలో చైతన్యవంతులైన యువత ఉందన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు లేవు, యువత ఉపాధి కోసం వలస వెళున్నారు. ఈ పరిస్థితి మారాలంటే ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి. నమ్మి అధికారంలోకి తెచ్చిన ప్రజలను వైకాపా మోసం చేసింది. ఐదేళ్లుగా ఏపీలో అభివృద్ధి లేదు. పేదల వికాసం కోసం కాదు.. మాఫియా వికాసం కోసం వైకాపా పనిచేసింది. వైకాపా ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. పుంగనూరులో ఐదేళ్లుగా రౌడీ రాజ్యం నడుస్తోంది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక అన్ని మాఫియాలకు పక్కా ట్రీట్‌మెంట్ ఇస్తాం. ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జలజీవన్ మిషన్‌కు వైకాపా ప్రభుత్వం సహకారం అందించలేదు. ఐదేళ్లుగా రైతులు కూడా ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వస్తే సాగునీటి ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తవుతాయి. ఉపాధి కోసం వలస వెళ్లేవారిని అన్నిరకాలుగా ఆదుకుంటాం. గల్ఫ్‌కు వెళ్లే భారతీయులకు ఇప్పుడు గౌరవం పెరిగింది. ఖతార్‌లో చిక్కుకున్న భారతీయులను క్షేమంగా రప్పించాం. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ఇలా జరిగేది కాదు. అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్ చెబుతోంది. భారత్.. విభిన్న జాతుల సమూహం అని చెబుతోంది. తెల్లవాళ్లు, నల్లవాళ్లు అనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అధికారం కోసం ఆ పార్టీ దేశాన్ని విభజించి పాలించాలని చూస్తోందని మండిపడ్డారు. నంద్యాల- ఎర్రకుంట్ల రైల్వే లైన్ పనులు పూర్తయ్యాయి.

# వ్యతిరేకులను నరికేయండి

**అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్**
**వైఎస్ భారతికి షర్మిల కౌంటర్**
**మోడీ తీరుపైనా ఘాటు విమర్శలు**



కడప,మే8: ఓటమి భయంతో వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి ఊరు దాటేందుకు సిద్ధమయ్యారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. దీని కోసం పాస్‌పోర్టులు కూడా సిద్ధం చేసుకున్నారన్నారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓడితే అరెస్టు తప్పదనే భయంతో అవినాష్‌రెడ్డి ఉన్నారని.. ఎంపీగా ఆయన గెలిస్తే నేరం గెలిచినట్లేనన్నారు. కడపలో వైకాపా సింగిల్ ప్లేయర్ అంటూ ఇటీవల సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. వాళ్లే అధికారంలో ఉండాలి.. వాళ్లకు వ్యతిరేకంగా ఉన్నవాళ్లందరినీ నరికేయాలి.. వాళ్లే సింగిల్ ప్లేయర్‌గా ఉండాలి.. భారతి స్ట్రాటజీ ఇదేనా? గొడ్డలితో మిగతా వాళ్లనూ నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్. ప్రజలకు ఎంపీ అందుబాటులో ఉండాలంటే నాకు ఓటెయ్యండి. మీ ఎంపీని జైలులో కలవాలంటే అవినాష్‌రెడ్డికి ఓటెయ్యండి. దేవుడు మా వైపే ఉంటాడు.. గొడ్డలితో నరికే వాళ్ల వైపు కాదు' అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి షర్మిల రేడియో గిఫ్ట్‌గా పంపారు. ఏపీ ప్రజల మన్ కీ బాత్ ఆయన వినాలని కోరారు. ఆయనకు రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని విమర్శించారు. ఏపీ ప్రజలకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని మోసం చేసి ఎన్నికల కోసం మళ్లీ కపట ప్రేమ చూపిస్తున్నారని తెలిపారు. 10 ఏళ్లలో మోదీ చేసిన మోసాలపై 10 ప్రశ్నలు సంధిస్తున్నట్లు షర్మిల చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ,తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తో పొత్తుపెట్టుని.. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డితో ఏ పొత్తు లేదన్నట్టుగా సభల్లో ఆయనను దూషిస్తున్నారని షర్మిల విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ తిప్పలన్నీ కేవలం మైనారిటీ ఓటు బ్యాంక్ కోసం ఆయన చేస్తున్నారని ఆరోపించారు. అంటే హిందూ , టీడీపీ , బీజేపీ ఓటు బ్యాంక్ ఇన్టాక్టుగా చంద్రబాబు పొత్తుతో ఉండాలని.. మిగతా మైనారిటీ ఓటు బ్యాంక్ అంతా జగన్ కార్నర్ చేసుకోగలిగితే.. ఈ రెండు ఓటు బ్యాంక్‌లు మళ్లీ మోదీకే లబ్ది చేకూరాలన్నది ప్రధాని స్టాటజ్రీ అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీగారు.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు పిచ్చోలు కాదు.. ప్రజల గుండెచప్పుడు ఒకసారి వినండి'.. అంటూ షర్మిల టేప్ రికార్డర్ ఆన్ చేశారు. మన్‌కీ బాత్‌లో మోదీ ప్రసంగిస్తుంటారని, ఈ విధంగా ఆయనకు చెబితే అర్థమవుతుందని తమకు అనిపించిందని ఆమె అన్నారు. ఏపీ మన్‌కీ బాత్ ఒకసారి ప్రధాని చెవిలో పడితే బాగుంటుందని ఆమె అన్నారు.

# ప్రజా స్పదంన లేకున్నా బాబు పొట్లు

**గెలిచే నమ్మకం లేకనే ఎన్నికల్లో పొత్తులు**
**టిడిపి విమర్శలపై మండిపడ్డ అంబటి**



గుంటూరు,మే8 : చంద్రబాబు పర్యటనలో జన స్పందన లేకపోయినప్పటికీ అద్భుత ప్రజాదరణ అంటూ ఎల్లో మీడియా బాకాలు పలుకుతోందని జలవనరుల శాఖ మంత్రిఅంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో అంత ఆదరణ ఉంటే చంద్రబాబు ఒంటరిగా ఎందుకు పోటీ చేయరని, అందరూ కలిసి ఎందుకు పోటీకి దిగారని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేక కలిసి పోటీ చేయడానికి వేదిక సిద్ధం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 'పన్నులు లేకుండా ప్రభుత్వాలు నడుస్తాయా.. గతంలో చంద్రబాబు పన్నులు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారా' అంటూ ప్రశ్నించారు. నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకూడదని కుట్రలో భాగంగానే ఈ రాద్ధాంతమంతా చేస్తుంటే, దానికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా ఒంటరిగానే ప్రజల మద్దతు కోరుతోందని స్పష్టం చేశారు. ఓటమి భయంతో.. ఎవరికైతే ప్రజల మద్దతు లేదనుకుంటున్నారో.. వాళ్లే పొత్తుల కోసం చూస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లు వేశారు. చంద్రబాబుకు ఎన్నికలలో గెలుస్తామన్న నమ్మకం లేదు. చంద్రబాబును ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అసలు ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. పైగా బాబుది దుర్మార్గపు ఆలోచన. ఎప్పుడూ ఇతరులపైనే ఆధారపడే తత్వం. పైగా వెన్నుపోటు పొడుస్తాడు అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు.

## భీమిలి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

**ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన గంటా**

విశాఖపట్నం,మే8: భీమిలి నియోజకవర్గం మేనిఫెస్టోను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ఎట్టి పరిస్థితిలో మళ్లీ అధికారంలోకి రాకూడదని కూటమి పనిచేస్తుందన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. జూన్ 4న జగన్మోహన్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నారని అన్నారు. వైసీపీ పార్టీ మానిఫెస్టోలో దేనికి పొంతన లేదని... పాత మేనిఫెస్టోని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక



ఓటు చీలకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ఇప్పుడు తాము పొత్తు పెట్టుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైందని విమర్శించారు.

# పిడుగుల వాన పడే అవకాశం

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక**



అమరావతి,మే8 : బుధ, గురువారాల్లోనూ రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఈదురుగాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వివరిం చింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొంది. మరోవైపు మంగళవారం కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.4, ప్రకాశం జిల్లా ఎండ్రపల్లిలో 43.2, వైఎస్సార్ జిల్లా మద్దూరు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.9 డిగ్రీల చొప్పున, నెల్లూరు జిల్లా మనుబోలు, నంద్యాల జిల్లా మహానందిలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మొత్తం ఏడుగురు మృత్యువాత పడ్డారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో మొక్కజన్న చేలో పనిచేస్తున్న సమయంలో పిడుగుపాటుకు బందల నాగేంద్రం (52), ఆమె కుమార్తె యండ్రపల్లి నాగరాణి (25) మరణించారు. అదే మండలం కుందిరివానిపాలేనికి చెరదిన ఆవుల కోటేశ్వరరావు (45), బాపట్ల జిల్లా సంతమావులూరు గ్రామానికి చెందిన ఆయన మేనల్లుడు గోపి (25) గొర్రెలను మేపుతుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. కొబ్బరి చెట్టు విరిగి మీదపడడంతో పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మల శ్రీనివాస్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా బరకా కప్పేందుకు మోటార్ సైకిల్‌పై తన బాబారు ఇంటికి వెళ్లి బయట నుంచి ఆయనను పిలుస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

# వైసీపీనీ టార్గెట్ చేసిన బీజేపీ




విజయవాడ, మే 8 ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు వచ్చారు. రాజమండ్రి, అనకాపల్లి సభల్లో పాల్గొన్నారు. వైసిపి తో పాటు జగన్ పై టార్గెట్ చేసుకున్నారు. దీంతో కూటమి పార్టీల్లో ఒక రకమైన ఖుషి కనిపిస్తోంది. ప్రధాని సంతృప్తికరమైన కామెంట్స్ చేశారని మూడు పార్టీల శ్రేణుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గత నెలలో చిలకలూరిపేట సభకు హాజరైన మోదీ జగన్ సర్కార్ పై హాట్ కామెంట్స్ చేయలేదు. పొడిపొడిగా మాట్లాడేసి వెళ్ళిపోయారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మాత్రం అసంతృప్తి వ్యక్తం అయ్యింది. అయితే నిన్నటి సభల్లో మాత్రం తెలుగుదేశం పార్టీకి సంతృప్తికరంగా.. జగన్ పై ఓ రేంజ్ లో విరుచుకుపడ్డారు ప్రధాని మోదీ.తొలుత రాజమండ్రి సభలో ప్రధాని మోదీ వైసీపీ సర్కార్ విధానాలను తప్పుపట్టారు. అనకాపల్లి సభలో మాత్రం జగన్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అనకాపల్లి బెల్లం అంతర్జాతీయ ఖ్యాతి పొందిందని.. అలాంటి తీయటి ప్రభుత్వమే ఏపీలో ఏర్పడనుందని చెప్పారు. జూన్ 4న వచ్చే ఫలితాలు ఇంతకన్నా తీయగా ఉంటాయని.. ఏపీలో కూటమి ప్రభుత్వమే ఏర్పడుతుందని మోడీ స్పష్టం చేశారు. విశాఖ రైల్వే జోన్ ఇచ్చేందుకు తాము రెడీగానే ఉన్నామని.. కానీ ఇక్కడి ప్రభుత్వమే భూమి ఇవ్వడం లేదని మోడీ విమర్శించారు. ఏపీలో అవినీతి తప్ప ఇంకేమీ కనిపించడం లేదని హాట్ కామెంట్స్ చేశారు. కేంద్రం ఏపీలో ఎంతో అభివృద్ధి చేస్తుంటే.. ఇక్కడున్న వైసీపీ మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రధాని ప్రశ్నించారు.పోలవరం ప్రాజెక్టు పై సైతం ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. నాడు తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు కోసం కృషి చేశారని.. ఆయన కుమారుడు జగన్ మాత్రం ఏ పని చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం 15000 కోట్లుఇచ్చిందని.. ఆ నిధులు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. రైతుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ప్రధాని మోదీ తేల్చేయడం విశేషం.వైసీపీ తారక మంత్రం అవినీతి అవినీతి అవినీతి అంటూ.. ప్రధాని పదే పదే ప్రస్తావించటం గమనార్హం. చివరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పనులను సైతం రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ నిర్వాకం మూలంగానే అనకాపల్లి రైతులు చెరుకు పండించడం మానేశారని కూడా ఆరోపణలు చేశారు. ఏపీలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా కొనసాగుతోందని కూడా మోడీ ఆరోపించారు. కాంగ్రెస్, వైసిపి ఒక్కటేనని కూడా దుయ్యబట్టారు. మొత్తానికైతే అటు వైసీపీ సర్కార్ తో పాటు ఇటు జగన్ పై విమర్శలు చేయడంలో ప్రధాని ముందు వరుసలో నిలిచారు. అయితే గత ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ విషయంలో బిజెపి ఉదాసీనంగా వ్యవహరించింది. కానీ ఈ ఎన్నికలవేళ జగన్ ను ప్రధాని మోదీ టార్గెట్ చేసుకోవడం విశేషం.

# మోడీ టూర్ గేమ్ ఛేంజర్ అవుతుందా

కాకినాడ, మే 8 ఏపీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ గడువు సమీపిస్తోంది. కేవలం 5 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో అన్ని పార్టీలు దూకుడు పెంచాయి. ప్రచారాన్ని విస్తృతం చేశాయి. వైసిపి 175 అన్న నినాదంతో ముందుకెళ్తోంది. 2019 ఎన్నికల ఫలితాలను రిపీట్ చేయాలని భావిస్తోంది. అందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. కూటమి తరుపున చంద్రబాబు, పవన్, పురందేశ్వరి విస్తృత ప్రచారం చేస్తున్నారు. వైసిపి దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్నారు.జనసేన తరఫున సినీ నటులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొంటున్నారు.తాజాగా ప్రధాని మోదీ ఏపీలో అడుగుపెట్టనున్నారు. ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారు అయింది. 6, 8 తేదీల్లో నాలుగు లోక్సభ నియోజకవర్గాల పరిధిలో ప్రధాని పర్యటన సాగింది.రోడ్డు షో లతోపాటు భారీ బహిరంగ సభల్లో ప్రధాని పాల్గొనున్నారు. అయితే బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తున్న మూడు పార్లమెంట్ స్థానాల్లో ప్రధాని మోదీ పర్యటించారురాజమండ్రి నుంచి పురందేశ్వరి, అనకాపల్లి నుంచి సీఎం రమేష్ బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈనెల 6న ఆ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం కొనసాగనుంది. మరోవైపు రాజంపేట నుంచి బిజెపి అభ్యర్థిగా కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు. 8వ తేదీన ఆ పార్లమెంట్ సీటు పరిధిలో ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం చేశారు. అదే రోజు విజయవాడలో జరిగే రోడ్ షోలో సైతం ప్రధాని పాల్గొంటారు. అక్కడ టిడిపి అభ్యర్థి కేశినేని చిన్ని పోటీ చేస్తున్నారు. మరోవైపు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా సుజనా చౌదరి కూడా బరిలో ఉన్నారు.గత నెలలో చిలకలూరిపేట బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. అటు తరువాత ఇప్పుడే ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. అయితే బిజెపి పోటీ చేస్తున్న ఆరు పార్లమెంట్ స్థానాలను ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కచ్చితంగా నాలుగు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అరకు ఎస్టీ నియోజకవర్గం నుంచి కొత్తపల్లి గీత, అనకాపల్లి నుంచి సీఎం రమేష్, రాజమండ్రి నుంచి పురందేశ్వరి, నరసాపురం నుంచి శ్రీనివాస వర్మ,రాజంపేట నుంచి కిరణ్ కుమార్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇందులో కనీసం నాలుగు స్థానాలు అయినా దక్కాలని బిజెపి బలమైన ప్రయత్నం చేస్తోంది. అయితే ఈ నియోజకవర్గాల్లో బిజెపి బలం అంతంత మాత్రమే. దీంతో ఇక్కడ టిడిపి జనసేన కేడరే దిక్కు. అందుకే ప్రధాని సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏపీ పర్యటనకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో ప్రధాని పర్యటనతో కూటమికి గేమ్ చేంజర్ అవుతుందని ఆ మూడు పార్టీలు భావిస్తున్నాయి.కుదట పడ్డ టీడీపీగత ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలతో బీజేపీతో.. టిడిపి శ్రేణులకు భారీ గ్యాప్ ఏర్పడింది. ఎన్డీఏను విభేదించి బయటకు వెళ్లిపోయారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో దారుణ ఓటమి చవిచూశారు. ఎప్పుడైతే చంద్రబాబు బయటకు వెళ్లారో.. నాటి నుంచి జగన్ కేంద్ర పెద్దలకు దగ్గరయ్యారు. ఎన్నికలకు ముందు.. తరువాత



రాజకీయంగా లబ్ధి పొందారు కూడా. అయితే అసలు విషయాన్ని గ్రహించిన చంద్రబాబు ఎన్నికల అనంతరం బిజెపికి దగ్గర అయ్యేందుకు ప్రయత్నించారు. చివరకు ఎన్నికల ముంగిట బిజెపితో పొత్తు కుదుర్చుకున్నారు.అయితే ఎన్నికల నిర్వహణలో బిజెపి నుంచి ఆశించిన సహకారం కోసమే చంద్రబాబు 10 అసెంబ్లీ సీట్లు, ఆరు పార్లమెంట్ స్థానాలను త్యాగం చేశారు. అయితే బిజెపి నుంచి ఆశించిన సహకారం లేకపోవడంతో టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపించింది. గత నెలలో చిలకలూరిపేట సభకు హాజరైన ప్రధాని మోదీ వైసిపి పై ఎటువంటి విమర్శలు చేయలేదు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సహకారం అందించలేదు. దీంతో టీడీపీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన పెరిగింది. బిజెపి వైపు అనుమానపు చూపులు కూడా ప్రారంభమయ్యాయి.40 శాతం ఓటింగ్ ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి.. ఒకటి రెండు శాతం ఓట్లు ఉన్న బిజెపికి.. ఓట్లు బదలాయింపు జరగాలంటే టిడిపికి సంతృప్తి చేయాల్సిన అవసరం బీజేపీకి ఉంది. అందుకే ప్రధాని మోదీ ఏపీలో అడుగుపెట్టిన వేళ.. డీజీపీ బదిలీ అయ్యారు. టిడిపి కోరిన కీలక అధికారులపై బదిలీ వేటు పడింది. ప్రధాని మోదీ తన సభల్లో వైసీపీతో పాటు జగన్ ను టార్గెట్ చేసుకున్నారు. తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబుతో పాటు పవన్ పై అనుకూల వ్యాఖ్యలు చేశారు. ఏపీలో వారి నాయకత్వాన్ని సమర్థించేలా మాటలు చెప్పారు. దీంతో టీడీపీ శ్రేణులు కొంత కుదుటపడ్డాయి.ఏపీలో పాలన చేతకాని వ్యక్తి జగన్ అని ప్రధాని మోదీ ఆరోపించారు. అమరావతి, పోలవరంవంటి సమస్యలను కూడా ప్రధాని ప్రస్తావించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చిరకాల స్వప్నమైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని సైతం జగన్ పూర్తి చేయలేకపోయారని.. కనీసం దాని గురించి పట్టించుకోలేదని విమర్శించారు. పాలన చేతకాని అసమర్థుడు జగన్ అంటూ ఆరోపణలు చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీశారని విమర్శించారు. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి రుచికరమైన అంశాలే. తమకు ఇష్టమైన మాటలు ప్రధాని నోటి నుంచి వినిపించేసరికి వారు పూర్తిగా సంతృప్తి చెందుతున్నారు. వైసీపీతో బిజెపికి ఎటువంటి సన్నిహిత సంబంధాలు లేవని నమ్ముతున్నారు

# గెలుపుపై అందరిదీ ధీమానే

ఒంగోలు, మే 8 సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రచారాలను పీక్ స్టేజ్‌కు తీసుకెళుతున్నారు. నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో భారీ ర్యాలీలు, సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో తెలియచేసే పార్టీల మేనిఫెస్టోలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు సంధిస్తూ కేడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. దీంతో పట్టణాలతోపాటు పల్లెలు ఎన్నికల సంగ్రామానికి సిద్ధమవుతున్నాయి. ఎన్నికల ప్రచారం మరో నాలుగురోజుల్లో ముగియనుండటంతో అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో నియోజకవర్గాల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది.ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రచారానికి మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో భారీ ర్యాలీలతో రోడ్‌షోలు చేస్తూనే, మరోవైపు ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. మధ్య మధ్యంలో భారీ ర్యాలీలతో రోడ్‌షోలు చేస్తూ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.ఇటు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం, అటు ఒంగోలు అసెంబ్లీ స్థానాలు వైసీపీకి కంచుకోటగా ఉండటంతో ఈసారి కూడా తమ గెలుపు సునాయాసం చేసుకునేందుకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసులురెడ్డిలు ప్రచారాలను ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు ఇతర నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు భారీ ర్యాలీలతోపాటు గ్రామ గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తన తల్లి, జడ్‌పి ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ స్వగ్రామం బొద్దికూరపాడులో బూచేపల్లి కుటుంబం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనస్వాగతం పలికారు. దర్శి నియోజకవర్గంలో బూచేపల్లి కుటుంబాన్ని ముందు నుంచి ప్రజలు ఆదరిస్తూ వస్తున్నారని, ఈసారి కూడా సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు టీడీపీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. బాపట్లజిల్లా పర్చూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భారీ ర్యాలీలు నిర్వహిస్తూ, గ్రామాలను చుట్టేస్తున్నారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న స్వర్ణ గ్రామంలో పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరడంతో ఇక్కడ భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. గత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏలూరి సాంబశివరావు ఈసారి కూడా ఎన్నికల్లో తనను గెలిపించి హ్యాట్రిక్ సాధించేందుకు ప్రజలు సహకరించాలని కోరుతున్నారు.మరోవైపు అద్దంకి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. మార్టూరు నుంచి ఒకసారి, అద్దంకి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గొట్టిపాటి రవికుమార్ ఐదోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

# అంబటికి ఇంటి పోరు

గుంటూరు, మే 8 ఏపీలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ.. పొలిటికల్ హీట్ మరింత పెరుగుతోంది. మరీ ముఖ్యంగా ఇప్పుడు అంబటి వర్సెస్ అల్లుడు రాజకీయం జరుగుతోంది. రెండు రోజుల క్రితం అంబటి రాంబాబు అల్లుడు డాక్టర్ గౌతమ్.. చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని లేపాయి. ఆయనంత నీచుడు, నికృష్టుడు ఉండడని, అలాంటి వాడికి అల్లుడిని అయినందుకు సిగ్గుగా ఉందని గౌతమ్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. జీవితంలో మళ్లీ అలాంటి వ్యక్తిని కలవాలని అనుకోవడం లేదన్నాడు.అల్లుడి వీడియోపై స్పందించిన అంబటి దానివెనుక పవన్, చంద్రబాబు, కన్నా ల హస్తం ఉందని ఆరోపించారు. అలాగే తన కూతురు, అల్లుడి విడాకుల కేసు నడుస్తుందని, ఫ్యామిలీ విషయాలను రాజకీయాలను వాడుకునేంతలా దిగజారిపోయారని విమర్శించారుమరోసారి అల్లుడు గౌతమ్.. అంబటి రాంబాబుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి చావు బ్రతుకుల్లో ఉన్నప్పుడు కూడా తన మనవడు, మనవరాలిని చూడనివ్వకుండా చేశారని వాపోయారు. రెండ్రోజుల క్రితం అంబటి రాంబాబు ప్రెస్ మీట్ పెట్టి మరీ కొన్ని విషయాలు చెప్పారని, తన మామయ్య ఇంత మంచివాడా అని 2 నిమిషాలపాటు తానే నమ్మేశానన్నారు. నిజంగానే ఇసుమంత మంచితనం ఉంటే బాగుండేదన్నారునాలుగేళ్లుగా తన మనవడు, మనవరాలు తనవద్దే ఉన్నారని, వారిని ఆర్థికంగా తానే చూసుకుంటానని చెప్పారన్నారు. అల్లుడిగా తాను ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదు కాబట్టి దుర్మార్గుడిని తానే అవుతానని చెప్పారన్నారు. తనవెనుక మోదీ, పవన్, చంద్రబాబు ఉండి ఈ ఆరోపణలు చేయిస్తున్నారని చెప్పారని తెలిపారు. అయితే తాను చెప్పింది ఎంత నిజమో తెలియాలంటే ఒక వీడియో చూడాలని చెబుతూ.. 2023, మార్చి3న పంపిన తన తండ్రి వీడియోను చూపించారు.అందులో గౌతమ్ తండ్రి.. తనకు మనవడు, మనవరాలిని చూడాలని ఉందని, వాళ్లని అర్జెంటుగా పంపాలని ఐసీయూలో ఉండి విజ్ఞప్తి చేసారు. ఆఖరి క్షణాల్లో తన తండ్రి వారసులను చూసుకోలేకపోయానని ఎంతో బాధపడ్డారని మీకు తెలుసా ? అని అంబటిని ప్రశ్నించారు. అంబటి వారి ఫ్యామిలీని క్వశ్చన్ చేస్తే దుర్మార్గులవుతారా అని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా న్యాయం చేస్తారని నమ్మి, విసుగెత్తి కోర్టుకు వెళ్తే దుర్మార్గుడిగా ముద్రవేశారన్నారు. తన కొడుకు, కూతురిని పోషించనక్కర్లేదని, మీడియా సాక్షిగా నేనే తీసుకెళ్తానని తెలిపారు. నాన్నగా నన్ను వాళ్లకు దూరం చేసి.. ఎలాంటి తప్పు చేయలేదని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.

# వర్షంలోని కొత్తపల్లి గీత ప్రచారం

అరకు ,వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అరకు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిని కొత్తపల్లి గీత. మంగళవారం నాడు జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం ముల్లేరు గ్రామంలో ప్రచార రథం నుండి ఓటర్లనుద్దేశించి ప్రసంగించారు. గ్రామంలో రాములవారి గుడి ఆవరణలో మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులకు,కార్యకర్తలకు,ప్రజలకు శిరస్సువంచి పాదాభివందనం చేస్తున్నానని .అనకాపల్లిలో నిన్న జరిగిన ప్రధాని బహిరగసభ వేదికపై ప్రధాని నరేంద్రమోదీ నా గెలుపుకు మద్దతుగా తలపై చేయిపెట్టి మనస్ఫూర్తిగా ఆశీర్వదించారని చంద్రబాబు గారు కూడా నిండుసభలో దీవించారని, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేశారనీ,, దళితులను చంపి డోర్ డెలివరీ చేసి వాళ్ళ ఇక్కడ రాజకీయనాయకులు గా స్థానికంగా చెలామణి అవుతున్నారని వైసిపి నాయకులను విమర్శించారు ప్రతి చోటా లాగే రంపచోడవరంలో కూడా గంజాయి రాజ్యమేలుతుందనీ గిరిజనుల మీద నిందలేస్తూ పెద్దలు వాళ్ళ పబ్బం గడుపుకుంటున్నారనీ విమర్శలు చేశారు. త్వరలోనే రంపచోడవరం ఏరియాలో పవన్ కళ్యాణ్ గారి సభ పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ప్రజలంతా సిద్ధంగా ఉండాలని అన్నారు.

# శ్యామలకు టీడీపీ నేతల కౌంటర్

కాకినాడ, మే 8 యాంకర్ శ్యామలపై టీడీపీ మహిళా నేత మండిపడింది. పవన్ కళ్యాణ్, చంద్రబాబుల గురించి మాట్లాడితే చీకటి బాగోతం బయటపెడతానంటూ వార్నింగ్ ఇచ్చింది. సోషల్ మీడియా వేదికగా శ్యామలను దుయ్యబట్టింది. యాంకర్ శ్యామల ఇటీవల ఏపీలో పర్యటించారు. ఆమె వైసీపీ పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ప్రత్యర్థి వంగ గీతను గెలిపించాలని శ్యామల అభ్యర్థించారు. గడపగడపకు తిరిగి ప్రచారం చేశారు. అలాగే మరికొందరు వైసీపీ అభ్యర్థులకు ఆమె తన మద్దతు తెలిపారు.అనంతరం ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్యామల ఏపీ సీఎం జగన్ అనుకూలంగా, ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మాటాడారు. ఈ క్రమంలో టీడీపీ మహిళా నేత ఉండవల్లి అనూష ఫైర్ అయ్యింది. ఎక్కడో హైదరాబాద్ లో ఉంటూ ఏపీ రాజకీయాల గురించి మాట్లాడితే ఊరుకునేది లేదు అన్నారు. తెలంగాణాలో షర్మిల పార్టీ పెడితే? ఆమెను కలిసి పార్టీ కండుగా కప్పుకుంది. షర్మిల జెండా ఎత్తేయడంతో ఏపీకి వచ్చి వైసీపీ పార్టీలో చేరింది.హైదరాబాద్ లో ఉండే నీకు ఏపీ రాజకీయాల గురించి ఏం తెలుసు. నష్టపోయింది మేము. అనుభవించింది మేము. టీవీ షోలు, సినిమా ఈవెంట్లు చేసుకుంటూ ఉండక నీకు రాజకీయాలు అవసరమా. ఇంకోసారి పవన్ కళ్యాణ్, నారా చంద్రబాబుల గురించి తప్పుగా మాట్లాడితే? నీ చీకటి బాగోతం బయటపెడతాను.మీ ఆయన చేసిన నేరాల గుట్టు విప్పుతాను. నిజాలు చెబుతాము. నీలా కథలు కాదని? ఘాటు వ్యాఖ్యలు చేసింది.ఉండవల్లి అనూష కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కాగా పవన్ కళ్యాణ్ తరపున జబర్దస్త్ కమెడియన్స్ తో పాటు మెగా హీరోలు ప్రచారం నిర్వహిస్తున్నారు. హైపర్ ఆది, గెటప్ శ్రీను, సుడిగాలి సుధీర్, రాకెట్ రాఘవతో పాటు పలువురు బుల్లితెర సెలెబ్రిటీలు పిఠాపురంలో పవన్ కళ్యాణ్ కి ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఇక మెగా హీరోలు అయిన వరుణ్ తేజ్, వైష్ణవ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ పిఠాపురంలో ఎన్నికల క్యాంపైన్ చేశారు. నాగబాబుతో పాటు ఆయన సతీమణి పద్మజ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విశేషం?

# వైసీపీకి మూసుకుపోతున్న దారులు

నెల్లూరు, మే 8 ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. పోలింగ్‌కు కేవలం వారం రోజులు మాత్రమే ఉంది. కేంద్రంలోని బీజేపీ పెద్దలు రంగంలోకి దిగి జగన్ సర్కార్‌ని ఏకి పారేశారు. అభివృద్ధి ఎక్కడా లేదని, కేవలం మాఫియా రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. ప్రచారంలో మోదీ, అమిత్ షా లేవనెత్తిన పలు అంశాలపై క్లారిటీ ఇవ్వలేక చేతులెత్తేశారు సీఎం జగన్. ఇందుకు కారణాలు లేకపోలేదు.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న అధికారులను కొందరిని కీలకమైన శాఖలకు, మరికొందరిని ముఖ్యమైన జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక తమకు తిరుగులేదని భావించారు ముఖ్యమంత్రి జగన్. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కొందరు అధికారులపై ఎన్నికల సంఘం కొరడా ఝులిపించింది. ఫలితంగా వై నాట్ 175 స్లోగన్ నినాదం మెల్లగా చతికిలపడింది. కనీసం జగన్ సభలు, రోడ్ షోల్లో మచ్చుకైన ఆ స్లోగన్ ఎక్కడా వినిపించలేదు.దాదాపు డజనకు పైగానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై వేటు వేసింది ఈసీ. కొందరికి పోస్టింగ్ ఇవ్వగా, మరికొందర్ని పెండింగ్‌లో పెట్టింది. ఈ జాబితాలో డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, పోలీస్ కమిషనర్లు, ఐజీ ర్యాంకు అధికారులు ఉన్నారంటే ఏపీలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు వైసీపీ సోషల్‌మీడియా ఇన్‌ఛార్జ్‌పై సీఐడీ కేసు నమోదు చేయడం అధికార ప్రభుత్వానికి మింగుడుపడడం లేదు.వరుసగా అధికారులపై ఎన్నికల సంఘం వేటు వేయడంతో సీఎం జగన్‌లో నిరాశ మొదలైంది. ఈ క్రమం లో ఏపీలో ఎన్నికలు సజావుగా సాగుతాయనే నమ్మకం లేదని సోమవారం రోడ్ షోల్లో చెప్పారు సీఎం జగన్. చివరకు పథకాలకు సంబంధించిన నిధులను కూడా ఆపేసిందని దుయ్యబట్టారు. మరో అడుగు ముందుకేసిన సజ్జల.. నిధుల విడుదల విషయంలో ఏపీలో ఒక రూల్, తెలంగాణలో మరో రూలా అంటూ ధ్వజమెత్తారు. దీంతో ఆయనలో నిరాశ మొదలైందన్నది ఆ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.ఈ విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సేఫ్ అని అంటున్నారు. ఆయనపై ఎలాంటి వేటు వేయకుండా నిధులు రిలీజ్ చేయకుండా ఆంక్షలు విధించింది ఈసీ. ఎందుకంటే ఎన్నికలకు కేవలం ఆరు రోజులు మాత్రమే ఉన్నాయి. ఈ క్రమంలో వైసీపీ సర్కార్‌కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. పలు సంక్షేమ పథకాలకు నిధులు విడుదలకు ఈసీ నిరాకరించింది.

# ఏపీలో పొలిటికల్ సర్కస్

శ్రీకాకుళం, మే 8 సిక్కోలు జిల్లా ఆముదాలవలస నియోజవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ ఏ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుస్తాడో ఆ పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుంది. ఇప్పుడక్కడ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న స్పీకర్ తమ్మినేని.. అటు వైసీపీలో వర్గపోరుతో పాటు ఇటు బామ్మరిది కూన రవి ప్రధాన ప్రత్యర్థిగా మారడంతో పొలిటికల్ సర్కస్ తప్పడం లేదు. ఇక టీడీపీ దిగ్గజ నేత యనమల, వైసీపీ మంత్రి అంబటి రాంబాబులు సైతం ఇంటిపోరుతో సతమతమవుతున్నారు.శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసలో వరుసగా నాలుగో సారి బావబామ్మరుదులు తలపడుతున్నారు. అక్కడ వైసీపీ అభ్యర్థిగా తలపడుతున్న ప్రస్తుత ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాంకి వ్యతిరేకంగా ఆ పార్టీ సీనియర్ నేత సువ్వారి గాంధీ రెబల్‌గా పోటీకి దిగారు. గాంధీ భార్య మాజీ ఎంపీపీ దివ్య, ఆయన మరదలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సువర్ణ పార్టీకి, పదవులకు రాజీనామా చేసేశారు. గాంధీ స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల్లో దిగుతున్నట్లు ప్రకటించి ప్రజల్లోకి వెళ్తున్నారు.అముదాలవలస టీడీపీ అభ్యర్థిగా ప్రభుత్వ మాజీ విప్ కూన రవికుమార్ పోటీలో ఉన్నారు. కూన రవికుమార్ అక్కనే తమ్మినేని సీతారాం వివాహం చేసుకున్నారు. 2009 నుంచి ప్రత్యర్థులుగా ఉన్న ఆ బావబామ్మరుదులు ప్రస్తుత ఎన్నికల్లోనూ వరుసగా నాలుగోసారి తలపడుతున్నారు. ఇప్పుడు బామ్మరిదిని కట్టడి చేయడానికే తమ్మినేని కష్టపడుతుంటే.. రెబల్ అభ్యర్థి గాంధీ చీల్చే ఓట్లపై ఆయన లెక్కలు వేసుకుంటూ టెన్షన్ పడుతున్నారంట. మొత్తానికి బావబామ్మరుదుల పోరు ప్రజాక్షేత్రంలో కురుక్షేత్రాన్ని తలపిస్తుంది. దీంతో నియోజకవర్గ రాజకీయం ఆసక్తికరంగా మారింది.

# స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో భాగంగా టోపీలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 08-బాధ్యత గల పౌరులుగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఛాంబర్ లో స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై టోపీలను ఆవిష్కరించారు. ప్రజాస్వామ్యపద్ధతిలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని, తమకు నచ్చిన వారికి ఓటు వేసి జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. 18 ఏళ్లు దాటిన ప్రతీ పౌరునికి మన రాజ్యాంగం ఓటుహక్కు కల్పించిందని....ఈ మేరకు జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వివిధ రూపాల్లో స్వీప్ యాక్టివిటీస్ ద్వారా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# మా ఊరి మద్దతు బైరెడ్డి శబరికే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 08-నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టరు . బైరెడ్డి శబరి కే మా గ్రామం మద్దతు అని బనగానపల్లె మండలం చెరువుపల్లె గ్రామ సర్పంచ్ షేక్ షావలి అన్నారు.బుధవారం నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో చెరువుపల్లె గ్రామస్తులు బైరెడ్డి శబరితో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ చెరువుపల్లి నుంచి సొంత వాహనాల్లో నంద్యాలకు వచ్చి తనకు మద్దతు ప్రకటించిన గ్రామ సర్పంచ్ షేక్ షావలితో పాటు గ్రామ పెద్దలకు ధన్యవాదములు చెప్పారు.కేంద్రం నుంచి నేరుగా గ్రామ సర్పంచ్ అకౌంట్ కు నిధులు వచ్చేవని, రాష్ట్రంలో జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం సర్పంచ్ నిధులు కూడా జగన్ పథకాలకు మళ్లించి గ్రామభివృద్ధి కుంటుపడేలా చేశారన్నారు. గ్రామాలకు నిధులు తెచ్చి అభివృద్ధి చేసే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకునేందుకు కలిసికట్టుగా ఈ ఐదు రోజులు పనిచేయాలని వారికీ సూచించారు. గ్రామ పెద్దలు సాకే చంద్రుడు, రాజమ్మగారి పెద్దబాషా, గొల్ల వెంకటసుబ్బయ్య, చిన్నస్వామి, ఆదిరెడ్డి, సాయిబాబా తదితరులు బైరెడ్డి శబరితో సమావేశమైయ్యారు.

# ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేద్దాం!

### వైసీపీ యం యల్ ఏ అభ్యర్థి .ఇంతియాజ్.

కర్నూల్.మే 8. విభారే న్యూస్ 9వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు వై ఎస్, జగన్మోహనరెడ్డి ,వైసీపీ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, కర్నూలు నగరానికి వస్తున్నారని, కావున వైసీపీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలనీ, పార్టీ శ్రేణులకు, ప్రజలకు, పిలుపునిచ్చారు. .నగరంలోని రాజ్ విహార్ సర్కిల్ దగ్గర గల వై ఎస్ ఆర్, విగ్రహం, కూడలిలో, జగన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. కావున వైసీపీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి సభను జయప్రదం చేయాలనీ కోరారు.

# పల్నాడు జిల్లాలో ఉద్రిక్తత

### హోమ్ ఓటింగ్ విషయంలో వివాదం

### టిడిపి కార్యకర్తలపై వైకాపా దాడి

పల్నాడు,మే8 : పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గాలు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. హోమ్ ఓటింగ్ విషయంలో వివాదం చెలరేగింది. టీడీపీ సానుభూతి పరుడైన బషయ్య ఇంటికి ఓటు కోసం వైసీపీ వర్గాలు వెళ్లాయి. అదే సమయంలో టీడీపీ వర్గాలు సైతం అక్కడకు వచ్చాయి. టీడీపీ కార్యకర్తల ఇళ్లపై వైసీపీ వర్గాలు రాళ్లు రువ్వాయి. ఇదే సమయంలో మీడియాపై సైతం వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు అక్కడే ఉన్నా కూడా ప్రేక్షక పాత్ర వహించడం గమనార్హం. వైసీపీ కార్యకర్తల దాడిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వైసీపీ నేతల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇష్టానుసారంగా దాడులకు పాల్పడుతున్నారు. నయానో భయానో టీడీపీ కార్యకర్తలను దారిలోకి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల టీడీపీ కార్యకర్తలపై దాడులకు వైసీపీ కార్యకర్తలు తెగబడుతున్నారు.

# ఎన్నికల్లో జగనన్న చరిత్ర సృష్టిస్తాడు: శిల్పా రవిరెడ్డి

--- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 08-కూటమి పార్టీల జతకట్టినా, కుట్రలు కుతంత్రాలు చేసినా...రానున్న ఎన్నికల్లో జగనన్న చరిత్ర సృష్టిస్తాడని నంద్యాల వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మున్సిపాలిటీ పరిదిలోని 41వ వార్డులో కౌన్సిలర్ పున్నా రాజేశ్వరి, రెండవ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ పున్నా శేషయ్య ఆద్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కుమారుడు పోచా జనార్ధన్ రెడ్డి, ఆర్టీఎం విద్యాసంస్థల చైర్మన్ మిద్దె శివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందరికి వివరిస్తూ ఎన్నికల కరపత్రాలను అందజేశారు. ప్రచారంలో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. గజమాలలతో, పూలమాలతో హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... దేశరాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించిన నాయకుడు జగనన్న మరోసారి చరిత్రను సృష్టిస్తాడని పేర్కొన్నారు. కూటమి పార్టీలు జతకట్టినా కూకటివేళ్లతో పెకలించే సత్తా వైఎస్సార్సీపీకి ఉందని, ప్రజలే మా అందరి ధైర్యం, నమ్మకం, దేవుని దీవెనలు, ప్రజలందరికి ఆశిస్సులు తమపై ఉన్నాయని రాష్ట్రంలో, నంద్యాలలో వైఎస్సార్సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేశాము కాబట్టే ప్రజల్లో ఉన్నామని, ప్రజల వద్దకు వెళ్లి ధైర్యంగా ఓటు వేయాలని కోరుతున్నామన్నారు. మంచి చేశామని, ఇంతకు మించిన మంచి కార్యక్రమాలను భవిషత్తులో చేపట్టేందుకు మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓట్లను వేసి వేయించి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డిని, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డికి బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో.



పాల్గొన్నారు.జె సి ఎస్ కన్వీనర్ దాల్మిల్ అమీర్ ,రాష్ట్ర ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి,,చేన్న వెంకటేశ్వర్లు, చేన్న శ్రీనివాసులు, ఘాఫూర్ ,కోట బాల వెంకటసుబ్బయ్య, ఆకుల వెంకటేశ్వర్లు, రహంతుల్లా ,పుసులూరు శ్రీను, వెంకటాద్రి ,పబ్బు తులసీ కృష్ణ, మోహన్, శేష పని, మధుసూదన్ ,ప్రసాద్ , మరియు వైసీపీ కార్యకర్తలు అభిమానులు మాజీ వాలంటరీలు పాల్గొన్నారు.

# చండీ సహిత సుదర్శన హోమంలో పాల్గొన్న బైరెడ్డి శబరి దంపతులు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 08-ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, నంద్యాల భగవత్ సేవా సమాజ్ ల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో శ్రీ మహారాజ యోగరుద్ర పాశుపత చండీ సహిత సుదర్శనహోమం జరిగింది.బుధవారం నంద్యాల సంజీవనగర్ శ్రీకోదండరా మాలయం ప్రాంగణంలో వేదపండితులు సుధీంద్రాచార్యులు, పవన్ శర్మ ల పర్యవేక్షణలో వేదపండితులు చండీ సహిత సుదర్శన హోమం వేదొక్తంగా నిర్వహించారు.శ్రీ మహారాజ యోగరుద్ర పాశుపత చండీ సహిత సుదర్శన హోమంలో నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టరు . బైరెడ్డి శబరి, ఆమె భర్త శివచరణ్ రెడ్డిలు అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డి శబరి దంపతులకు వేదపండితులు అర్చన, అభిషేకం, కంకణధారణ, హోమం పూజలు చేయించి పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.డాక్టర్ బైరెడ్డి శబరి, శివచరణ్ రెడ్డిలు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ప్రజలతో పాటు లోక కళ్యాణం కోసం



నంద్యాలలో శ్రీ మహారాజ యోగరుద్ర పాశుపత చండీ సహిత సుదర్శన హోమం భక్తి శ్రద్దలతో, వేదపండితులచే నిర్వహించడం జరిగిందన్నారు. విశేషపూజల అనంతరం రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు వెంకటరామాంజి, ప్రధాన కార్యదర్శి నగరడోన సుధీర్ శర్మ, మల్లిక, రేణుకలు బైరెడ్డి శబరి దంపతులను ఆశీర్వదించగా, బైరెడ్డి శబరి దంపతులు వేదపండితులను, భగవత్ సేవాసమాజ్ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.ఈ పూజల్లో రిటైర్డ్ న్యాయమూర్తి శివప్రసాద్, గాజుల పల్లి రవినాథరావు, భరధ్వాజ శర్మ, రావినూతల దుర్గాప్రసాద్, బాలమురళికృష్ణ, మనోహర్ శర్మ, అనుపూరు సాయి శర్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికి ఒంటిమిట్ట శ్రీసీతా రాముల వారి తలంబ్రాలు, అందజేసారు. భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం చేశారు.

# టిడిపిలో చేరిన ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ బీసీ సెల్ కోఆర్డినేటర్



కర్నూల్.. మే 8. విభారే న్యూస్ ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ బీసీ సెల్ కోఆర్డినేటర్ జి. నాగరాజు యాదవ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ సమక్షంలో ఆయన టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుండి తాను పార్టీలో ఉన్నప్పటికీ అవమానాలే పడ్డానన్నారు. వైసీపీలో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు. ప్రజాసేవ కోసం పరితపిస్తున్న టి.జి భరత్ నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. టి.జి భరత్ విజయం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కర్నూలు టిడిపి అభ్యర్థి టి.జి భరత్ మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుండి ఉన్న నేతలకు సైతం ఆ పార్టీలో న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తామని చెప్పుకుంటున్నారే కానీ చేతల్లో మాత్రం అలా జరగడం లేదన్నారు. కేవలం పదవులిచ్చి పవర్ లేకుండా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ నుండి తమ పార్టీలోకి చేరుతున్న నాయకులు ఎలాంటి కండిషన్లు లేకుండా స్వచ్ఛందంగా వస్తున్నట్లు తెలిపారు. బీసీలంటేనే టిడిపి అన్నారు. ఈ ఐదేళ్లలో జరిగిన పరిస్థితులు అందరూ గ్రహిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని టి.జి భరత్ తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సిటీ సేవాదల్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీ, ప్రవీణ్, శేఖర్, సురేష్, ఇక్బాల్, వేణు, నాసిర్, మౌలాలి, ఖాదర్, ఇంతియాజ్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జమీలా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై నిగ్గు తేలేనా

### అనుమానాలకు తావిచ్చేలా లీజు నిర్ణయం

### సమాధానం చెప్పని నాటి పాలకులు

హైదరాబాద్,మే8 : ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై విచారణకు ఆదేశించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి జిరగిందని గుర్తించామని అన్నారు. ఎన్నికలకు ముందే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అయినా దీనిపై విపక్ష బిఆర్ఎస్ నోరుమెదపడం లేదు. ఏదైనా ఆరోపణలు రాగానే అంతెత్తు ఎగిరిపడే నేతలు అసలు మట్లాడడం లేదు. ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రికెటిఆర్ కూడా దీనిపై పెదవి విప్పడం లేదు. నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని బయట పడేశాక బిజెపి అందుకుంది. ఇప్పుడు సిఎం అయ్యాక రేవంత్ రెడ్డి దీనిపైనా స్పష్టత ఇచ్చారు. విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, విచారణ కాగానే చర్యలు తీసుకుంటామని తాజాగా పలు టీవీ ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. అయితే అవినీతి జరిగివుంటే.. లేదా నిబంధనలకు విరుద్దంగా లీజ్ ఇచ్చివుంటే కేంద్రంలోని బిజెపి చర్యలు తీసుకోవచ్చు. నిజాలు నిగ్గు తేల్చవచ్చు. కానీ బిజెపి కాలేశ్వరం లేదా ఔటర్ లీజల విషయంలో కేవలం ఆరోపణలకే పరిమితం అవుతోంది. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం లీజుకు ఇచ్చే విషయంలో విపరీతమైన వివాదాలు నెలకొంటున్న వేళ నిజాలు నిగ్గు తేల్చాలి. నిజానికి ఓఆర్ఆర్ ను 30 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందన్న దానికి బిఆర్ఎస్ నుంచి సమాధానం రావడం లేదు. అధికారంలో ఉండగానూ, విపక్షంలోనూ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజు తమ అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చుకొని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించామని చెప్పారు. హెచ్ఎండీఏ కు ఓఆర్ఆర్ పై టోల్స్ వసూలు చేయడం ద్వారా రాబోయే 30 ఏళ్లలో రూ.75 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంటున్నారు. లీజు ఏ కంపెనీకి టెండరు రావాలో ముందే నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను ఎందుకు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిందని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం లీజు పక్రియ జరగలేదని ఆరోపించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను బట్టి లీజు పరిమితిని తగ్గించుకోవచ్చని నిబంధనల్లో ఉందని, కానీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఓఆర్ఆర్‌ను 30ఏళ్ళ వరకు లీజ్‌కు ఇవ్వాల్సిన అవసరం ఏంటన్న దానికి నాటి మంత్రి కెటిఆర్ నుంచి సమాధానం రావడంలేదు. సగటు టోల్ గేట్స్ నుండి వచ్చిన ఆదాయం రోజుకు కోటి ఎనభై ఐదు లక్షలు దాటింది. ఏడాదికి సుమారుగా 720 కోట్లు ఆదాయం వస్తోంది. ముప్పై ఏళ్లపాటు లీజుకు ఇవ్వడమంటే సుమారుగా ఇరవై వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. కానీ తాజా లీజు కారణంగా కేవలం 30వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మరి అంతలా ఆదాయం వస్తున్న ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్స్ లీజును అప్పనంగా ఓ కంపెనీకి కేవలం 7380 కోట్లకు 30 ఏళ్లపాటు ఎలా కేటాయిస్తారంటూ గత ఎన్నికల ముందు ప్రశ్నించారు. వెంటనే ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ గేట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వమే టోల్ గేట్ లను నిర్వహిస్తూ బ్యాంక్ నుండి నిధులు తెచ్చి బ్యాంక్ వడ్డీ చెల్లించినా మంచి లాభాలు వస్తాయని, అలాంటిది ప్రజల సొమ్మును వేలకోట్ల రూపాయలు ఐఆర్‌బి అనే సంస్థకు అప్పగించడం వెనుక ఉన్న గూడుపుఠాణి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అందులోనూ డిఫాల్టర్ గా ఉన్న ఐఆర్‌బి కంపెనీకి తిరిగి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్ నిర్వహణ ఒప్పందం పక్రియ వెంటనే ఆపకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఈ వ్యహారంపై సిబిఐ, ఈడిల కు ఫిర్యాదు చేయడం తోపాటు ఈ టోల్ గేట్ కుంభకోణంపై పోరాటం చేయనున్నట్లు బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. ఔటర్ వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఆరోపణలు చేశారు. ఇదేనా కేసీఆర్ చెప్పే గుణాత్మకమైన మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

### అబద్దాల ప్రచారంతో విమర్శలు దారుణం

### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,మే8: సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తూ రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్దాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గాడిద గుడ్డు పెట్టదు కానీ రేవంత్ రెడ్డి పెట్టించారని విమర్శించారు. ప్రతి పబ్లిక్ మీటింగ్‌లో గాడిద గుడ్డుతో వస్తుంటే.. రేవంత్ రెడ్డి పార్టీ గాడిద గుడ్డు పార్టీయా? ఆయన గుర్తు గాడిద గుడ్డా? అని తెలంగాణ ప్రజలు అనుకుంటున్నారని సెటైర్ వేశారు. బీజేపీ రిజర్వేషన్లను తీసేస్తుందని జరుగుతున్న ప్రచారంపై కూడా కిషన్‌రెడ్డి స్పందించారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లను ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను తొలగించబోమని ప్రధాని మోదీ కూడా చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని ధ్వజమెత్తారు. బీజేపీని.. కురే కురే బీజేపీ అని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్లపై కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ చిల్లర గాడు! అన్ని చిల్లర మాటలు మాట్లాడుతారని అని మాస్ సెటైర్లు విసిరారు. కేటీఆర్ పేరు కూడా ఉచ్చరించడం కూడా తనకు ఇష్టం ఉండదని.. అందుకే ఎప్పుడూ ఆయన పేరు ప్రస్తావించనని అన్నారు. కేటీఆర్ కామెంట్లపై తాను స్పందించనని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఖండిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ లబ్దిదారులే బీజేపీపై విశ్వాసంతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు.కాంగ్రెస్ 'రిజర్వేషన్' ప్రచారం ఫెయిల్ అయిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది బాధ్యతారాహిత్యమైన విమర్శ అని కొట్టిపారేశారు. వెనుకబడిన వర్గాలనుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చారని.. రిజర్వేషన్లు తొలగించరనే విశ్వాసం ప్రజల్లో ఉందని చెప్పు కొచ్చారు. బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తారని చెప్పారు. దేశం, రాష్ట్రంలోఅత్యధిక స్థానాలు బీజేపీ గెలువబోతోందని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీ పట్ల విపక్షాలు చేస్తున్న వ్యతిరేక ప్రచారం తమకు అంత సానుకూలంగా మారుతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అవకాశం ఇచ్చారని అన్నారు. అంతకుముందు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉందని అన్నారు. ఈసారి మెజార్టీ ఓట్లు, సీట్లు బీజేపీకే వేయాలని నిశ్చయించుకున్నారని చెప్పుకొచ్చారు.ఇది చూసి కాంగ్రెస్ పార్టీలో కలవరం పెరిగిందన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190